సాక్షి కృష్ణాజిల్లా

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



తిరుపతమ్మకు బంగారు నెక్లెస్

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారికి శుక్రవారం తెనాలికి చెందిన లంక శ్రీనివాసరావు, రత్నజ్యోతి దంపతులు 20గ్రా. బంగారు నెక్లెస్, 135గ్రా. వెండి గిన్నెను అందజేశారు.



నేటితో తిరునాళ్ల ముగింపు

వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం శనివారంతో ముగియనుండటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు బారులు తీరారు. -10లో▸

సాంకేతిక సాయంతో నేరాల అదుపు



సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అదుపు చేస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. పామర్రు సర్కిల్, గన్నవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. -10లో▸

న్యూస్‌రీల్

భూముల రీసర్వేతో సమస్యలకు చెక్



పెనమలూరు: భూములు రీసర్వే చేయించటంతో సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర సర్వే కమిషనర్ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ డీఎల్ బీఎల్ కుమార్ అన్నారు. మండల పరిధిలో పెద పులిపాక గ్రామంలో భూములపై జరుగుతున్న రీసర్వే పైలెట్ ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ భూములు రీ సర్వే చేయటంతో భూయజమానులకు మేలు చేయటమే కాకుండా ప్రభుత్వ భూములు గుర్తిస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఈ సర్వే ఉపయోగపడుతుందని వివరించారు. భూ యజమానులు కూడా వారి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివప్రసాద్, మండల సర్వేయర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోండి



చిలకలపూడి(మచిలీపట్నం): మాతృభాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తెలుగుతల్లి విగ్రహానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. జేసీ మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదన్నారు. తెలుగుభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. పాఠశాలల్లో భాష ప్రాధాన్యతపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

జీజీహెచ్‌లో అందుబాటులోకి టిఫా స్కాన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భస్థ పిండంలోని అవయవ లోపాలు, బ్రెయిన్ ఎదుగుదలను గుర్తించేందుకు అవసరమైన టిఫా స్కాన్‌ను విజయవాడ ప్రభుత్వాస్పత్రి ప్రసూతి విభాగంలో ఏర్పాటు చేశారు. దానిని శుక్రవారం రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు(అకడమిక్) డాక్టర్ రఘునందన్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న అల్ట్రాసౌండ్ మెషీన్‌ల కంటే హై రిజల్యూషన్‌తో పిండం ఎదుగుదల, అవయవాల రూపుదిద్దుకుంటున్న తీరు వంటి వాటిని ఈ టిఫా స్కాన్‌తో కచ్చితంగా నిర్ధారణ చేయవచ్చన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. అశోక్‌కుమార్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ. వెంకటేశ్వరరావు, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ పార్వతీశంరావు, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, పిడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ పి. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వంశీతో పేర్ని ములాఖత్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై తప్పుడు కేసులు, అభియోగాలు మోపారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. టీడీపీ పెట్టిన అక్రమ కేసులో అరెస్టయి జైలులో ఉన్న వంశీతో శుక్రవారం ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీసు శాఖ, పోలీసు అధికారులు కింద స్టేషన్ స్థాయి నుంచి పర్యవేక్షణ చేస్తున్న వారు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యంగా పటమట ప్రాంతానికి చెందిన పోలీసులు దారుణంగా కేసులు కడుతున్నారన్నారని విమర్శించారు. 10వ తేదీ సత్యవర్ధన్ కోర్టు ముందు హాజరై.. తన చేత తప్పుడు కేసు పెట్టించారని జడ్జిముందు చెప్పారన్నారు. క్రిమినల్ కేసుల్లో ముద్దాయిగా ఉన్న ఫణికుమార్ అనే టీడీపీ కార్యకర్త 11న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టులను, పోలీసులను తప్పుదారి పట్టించారని సత్యవర్ధన్, వంశీపై కేసు కట్టారని తెలిపారు. 12న సత్యవర్ధన్ అన్న చేత ఫిర్యాదు తీసుకుని కేసు కట్టారన్నారు. ఈ కేసులో ఎక్కడా ఆధారాలు లేవన్నారు. వీటన్నిటిపై వంశీ కుటుంబం న్యాయస్థానాల్లో పోరాడుతుందన్నారు.

అక్కడ లేను.. అయినా కేసు..

రైతులను పరామర్శించేందుకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ గుంటూరు వచ్చినపుడు, తాను మచిలీపట్నంలో ఉన్నానన్నారు. తన పైన పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీనిపై డీజీపీకి ఈమెయిల్ లేఖ రాశానన్నారు. మచిలీపట్నంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు అందరి ఫోన్లు, కుటుంబ సభ్యుల ఫోన్లు సేకరిస్తున్నారన్నారు.

నిల్వ నీడ కరువు!

పంట నిల్వకు అవకాశం లేక నష్టాల పాలు

రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునే వెసులుబాటు లేక నష్టపోతున్నారు. కోసిన పంట కోసినట్లు తక్కువ ధరకైనా అమ్ముకోవాల్సి రావడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. కృష్ణా జిల్లాలో వాణిజ్య పంటలకు కేరాఫ్ అయిన మోపిదేవి మండలంలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రస్తుతం కూరగాయలకు సరైన రేటు లేకపోవడంతో చాలా మంది రైతులు చేతికొచ్చిన పంటలను కూడా అలాగే వదిలేస్తున్నారు. ఏళ్లుగా మోపిదేవిలో రైతు బజార్ లేదా గిడ్డంగులు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు.

- రైతులు కుదేలు అవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- గిడ్డంగులు, లేదా రైతు బజార్ నిర్మించాలని ఏళ్లుగా వేడుకోలు
- మోపిదేవిలో స్థలం కేటాయించి ఆరేళ్లు అయినా ప్రయోజనం లేదు



మోపిదేవివార్పు వద్ద క్యాబేజి పంటను రోటోవేటర్‌తో దున్నేస్తున్న దృశ్యం(ఫైల్)

మోపిదేవి: భూమిని నమ్ముకుని సాగులో నిమగ్నమైన రైతులు వాణిజ్య పంటలు వేసి మరోసారి నిండా మునిగిపోయారు. ఇటీవల కృష్ణానదికి వచ్చిన భారీ వరదలకు లంక గ్రామాల్లో వేసిన పసుపు, కంద, జామ, అరటి వంటి తోటలు వేసి చేతికి వచ్చే సమయంలో కృష్ణమ్మ ఆగ్రహానికి గురై పంటలు మొత్తం కొట్టుకుపోయాయి. దీంతో కొంత సమయం తీసుకుని మరికొంత అప్పులు చేసి కృష్ణానది ఒడ్డున లంక గ్రామాల్లో పలు రకాల కూరగాయల పంటలు సాగు చేపట్టారు. ఈ ప్రాంతాల్లో కొన్ని వందల ఎకరాల్లో టమాటా, మిర్చి, క్యాబేజి సాగు చేపట్టారు. ప్రస్తుతం వీటి ధరలు దారుణంగా పడిపోవడంతో కనీసం కూలీల ఖర్చులు కూడా రావడంలేదని పంట పొలాల్లోనే టమాటా, మిర్చి వదిలేస్తుండగా, క్యాబేజీ పంటను రోటోవేటర్ వేసి దున్నేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 10,270 హెక్టార్లలో ఉద్యాన పంటలు ఉన్నాయి.

అధికారులు భరోసా ఇచ్చినా..

ఇటీవల మండలంలోని మోపిదేవివార్పు, బొబ్బర్లంక గ్రామాల్లో ధరలు లేవని రైతులు పండించిన క్యాబేజి పంటను దున్నేశారు. నాడు మార్కెట్‌యార్డు రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ పి. లావణ్య, మార్కెట్‌యార్డ్ ఏడీ నిత్యానందం ఘటనా స్థలానికి చేరుకుని పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఆ సమయంలో రైతులు మరోసారి మోపిదేవిలో మోడల్ రైతు బజారు హామీని గుర్తుచేశారు. వెంటనే రైతు బజారు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ప్రాధేయపడ్డారు. ప్రస్తుతం కోసూరువారిపాలెం, మెరకనపల్లి గ్రామాల్లో పండించిన టమాటా, మిర్చి పొలాల్లో వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రైతు బజారుకు కేటాయించిన స్థలాన్ని మార్కెట్ యార్డ్ అధికారికి అప్పగిస్తున్న తహసీల్దార్(ఫైల్)

రైతు బజార్ కలేనా?

ధరల ఒడుదొడుకులు ఉన్న సమయంలో పంటలు నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు లేదా కనీసం మోడల్ రైతు బజారు ఏర్పాటు చేయాలని రైతులు ఎంతోకాలంగా పోరాటం చేస్తుండగా.. 2018లో ఆర్‌ఎస్ నంబర్ 147లో మోపిదేవికాలనీ వద్ద 0.20 ఎకరాల స్థలం కేటాయించారు. సరిహద్దులు నిర్ణయించి సంబంధిత లెటర్‌ను అప్పటి తహసీల్దార్ విమలకుమారి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెట్ యార్డ్‌కు అప్పగించారు. దీనివల్ల రైతులు పండించిన పంటను వారి చేతుల మీదుగానే అప్పటికప్పుడు రైతు బజారులో నేరుగా విక్రయించుకోవచ్చని ఆనంద పడ్డారు. కానీ రైతులు అంటేనే గిట్టని నేటి పాలకులు, అధికారులు మరోసారి మోసగించారు.

రైతు బజారు చాలా అవసరం..



దివిసీమలోనే అత్యధికంగా వాణిజ్యపంటలు సాగు చేస్తున్న మండలం మోపిదేవి. ఇక్కడ అన్నిరకాల కూరగాయల పంటలు సాగుచేస్తారు. రైతు బజారు ఏర్పాటు చేస్తే తాజా కూరగాయలను దళారులు లేకుండా చాలా తక్కువ ధరకే అమ్మకాలు జరుగుతాయి. అధికారులు స్పందించి వెంటనే రైతు బజారు ఏర్పాటు చేయాలి.

– గద్దె బాబూరావు, రైతు, మోపిదేవి

అధికారులు స్పందించడం లేదు..



ప్రభుత్వం స్థలం కేటాయించినా రైతు బజారు ఏర్పాటుకు అధికారులు ముందుకు రాకపోవడం శోచనీయం. రైతు బజారు ఏర్పాటు వల్ల రైతులకు కొంత మేలు జరుగుతుంది. నేరుగా మార్కెట్‌లో అమ్మకాల వల్ల నష్టపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– సనకా నరసింహారావు, రైతు, కోసూరువారిపాలెం

ఎన్నికల కోడ్ అనంతరం పరిశీలిస్తాం..



ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎన్నికల అనంతరం ఫైల్ పరిశీలించి రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. స్థలం కేటాయించి ఉంటే తప్పకుండా ఏర్పాటుకు సహకరిస్తాం.

–లావణ్య, మార్కెట్‌యార్డు ఆర్‌డీడీ

నేడు, రేపు ఉచిత పుస్తకాల పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, సర్వోత్తమ గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ పటమటలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచిత పుస్తకాల పంపిణీ చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి రావి శారదా తెలిపారు. శుక్రవారం పటమటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా తాము ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రెండు రోజుల పాటు జరిగే ఈ పంపిణీ తొలుత 6 వేల పుస్తకాలతో ప్రారంభమైందని, ఈ ఏడాది పుస్తకాలను 30 విషయాలుగా విభాగించి సామాన్యుడు సైతం సులభంగా పుస్తకాలను ఎంపిక చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నామన్నారు. ఇందులో చిన్నపిల్లల పుస్తకాలు నుంచి వేదాంత గ్రంథాలు, అన్ని తరగతుల పాఠ్య గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఇంజినీరింగ్, మెడిసిన్ అరుదైన గ్రంథాలు, వైద్యశాస్త్రంలో వేదం వంటి రెండు సంపుటాల హరిసన్స్, మెడిసిన్, మరెన్నో ఖరీదైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఇంతియాజ్ ప్రారంభిస్తారని, పుస్తక ప్రియులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ప్లాట్ ఫాంపైకి దూసుకెళ్లింది. సేకరించిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సు స్టాండింగ్‌లో నుంచి తీసే సమయంలో ఒక్కసారిగా అదుపు తప్పి ముందుకు దూసుకెళ్లింది. ప్లాట్ ఫాంపై ఉన్న పిల్లరును ఢీకొట్టింది. అయితే ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు, ఆర్టీసీ డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగక పోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గతంలో కూడా ఇదేవిధంగా జరిగిన ఘటనలో ఇరువురు ప్రాణాలు కోల్పోయారు. మళ్లీ అలాంటి ఘటనే జరగడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతతో ప్రాణాలు కాపాడుకుందాం

కలెక్టర్ డీకే బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటుబెల్టు ధరిస్తే రోడ్డు ప్రమాదాల బారిన పడినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025 జనవరి నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 90 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. వాటిలో 41 మరణాలు, 76 మంది గాయాలపాలయ్యారన్నారు. జిల్లాలోని జాతీయ రహదారులపై ఏఐ పవర్ సీసీ టీవీల సాంకేతిక పరిజ్ఞానంతో అధిక వేగంతో వెళ్లే వాహనాలను గుర్తించటం, హెల్మెట్ లేకుండా ప్రయాణించే చోదకులను గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా జరిమానాలు విధించాలన్నారు.

- బందరు మండలం ఎస్.ఎన్‌గొల్లపాలెంలోని విద్యార్థులు సమీపంలోని జాతీయ రహదారిని దాటుకుని నేషనల్ కళాశాలకు చేరుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, రహదారిపై అకస్మాత్తుగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఆ ప్రాంతంలో పరిష్కార మార్గాల కోసం రవాణా, జాతీయ రహదారులు, పోలీసులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు.
- మచిలీపట్నం నగరంలో రహదారి వెంబడి ఏర్పాటు చేసిన శుభకార్యాలు, పుట్టినరోజులు, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- జిల్లా పరిషత్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై వంగిపోయిన స్తంభాన్ని వెంటనే తొలగించాలన్నారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి వచ్చే బైపాస్‌రోడ్డులో వినాయకుడి సెంటర్‌లో భారీ గుంతకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

సమావేశంలో జిల్లా రవాణాధికారి బీఎస్ఎస్ నాయక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. సిద్ధిఖ్, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్. శర్మిష్ఠ పాల్గొన్నారు.

హోటళ్ల స్వచ్ఛతా ప్రమాణాలకు రేటింగ్

- వన్ లీఫ్, త్రీ లీఫ్, ఫైవ్ లీఫ్ స్టేటస్ ఇచ్చేందుకు కార్యాచరణ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వచ్ఛతా ప్రమాణాలు పాటించే హోటల్స్, లాడ్జీలకు ప్రభుత్వం గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వనుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ (ఎస్‌జీఎల్‌ఆర్‌ఎస్)పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆతిథ్య రంగం కీలకమైందన్నారు. స్థానిక సమాజం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుత పర్యాటకంలో భాగంగా ఆతిథ్య రంగంలో సురక్షిత పారిశుద్ధ్య నిర్వహణను ప్రోత్సహించేందుకు గ్రీన్ లీఫ్ రేటింగ్ వ్యవస్థను ఆవిష్కరించినట్లు వివరించారు.

రేటింగ్స్ ఇలా..

హోటళ్లు, లాడ్జీలు, హోమ్‌స్టేలు, ధర్మస్థలాలు తదితర ఆతిథ్య సౌకర్యాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇస్తామని కలెక్టర్ చెప్పారు. వన్ లీఫ్ రేటింగ్ పొందాలంటే ఘన వ్యర్థాలు, మానవ వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణలో 100–130 మార్కులు రావాలన్నారు. త్రీ లీఫ్ రేటింగ్‌కు 130–180 మార్కులు, ఫైవ్ లీఫ్ రేటింగ్‌కు 180–200 మార్కులు సాధించాల్సి ఉంటుందని వివరించారు. రేటింగ్‌కు సిఫార్సు చేసేందుకు వీలుగా జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్ కన్వీనర్‌గా, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శిగా కమిటీ ఉంటుందన్నారు. అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో చైర్మన్‌గా వెరిఫికేషన్ ఉప కమిటీ ఉంటుందని తెలిపారు. డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రేటింగ్ వ్యవస్థ గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలోనూ వర్క్‌షాప్‌లతో పాటు శిక్షణ కార్యక్రమాలపైనా దృష్టిసారించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓలు చైతన్య, కె మాధురి, బాలకృష్ణ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్వీ స్వామి, ఏపీ టీడీసీ డివిజనల్ మేనేజర్ చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, గ్రామవార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీపీవో పి.లావణ్య కుమారి, జిల్లా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధి టి.రవికుమార్, డీఎల్‌డీవోలు పాల్గొన్నారు.

రంగు చేపలతో ఉపాధి అవకాశాలు



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ రాథోడ్

పెనమలూరు: రంగు చేపల పెంపకంతో మహిళలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని పోరంకిలోని సేంద్రియ మంచినీటి జీవపాలన సంస్థ, ప్రాంతీయ పరిశోధన కార్యాలయం ఇన్‌చార్జ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ రాథోడ్ అన్నారు. పోరంకిలోని ప్రాంతీయ కార్యాలయంలో గత మూడు రోజులుగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మల్లవరం గ్రామ స్వయం సహాయ సంఘం మహిళా సభ్యులకు చేపల రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధిపై శుక్రవారం ముగిసిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేడు రంగు చేపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, వీటిని ఇంట్లో అలంకరణకు పెంచుకోవటానికి ప్రజలు చాలా ఆసక్తి చూపుతున్నారని వివరించారు. సైంటిస్టు అజిత్‌కేశవ్ చౌదరి మాట్లాడుతూ గ్లాస్ ఆక్వేరియమ్, చేపల మేత తయారు చేయటం నేర్చుకుంటే వ్యాపారం వృద్ధి చేసి లాభాలు పొందవచ్చన్నారు. మూడు రోజుల శిక్షణలో దీనిపైనే ప్రత్యేకంగా అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందచేశారు. నాగాయలంక బావదేవరపల్లి మత్స్య పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల ఆందోళన బాట

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో పనిచేస్తున్న ఆప్కాస్(ఏపీ కార్పొరేషన్ ఆఫ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్) ఉద్యోగులు తమ జీతాలు పెంచాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఉద్యోగులు నిలబడి తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మేడూరి శేషుబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ పశువైద్య కళాశాలను స్థాపించి పాతికేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క ప్రభుత్వ నియామకం చేపట్టలేదన్నారు. ఈ కళాశాలను నమ్ముకొని అవుట్ సోర్సింగ్ విధానంలో కోస్టల్ ఆంధ్రా జోనల్‌లో 498 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్ విధానాన్ని తొలగించి తిరిగి ప్రైవేట్ ఏజెన్సీల చేతులకు ఉద్యోగులను అప్పగించాలని చూడడం దుర్మార్గమన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు అంజిబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వస్త్రాలకు చిహ్నం కో–ఆప్టెక్స్

తమిళనాడు చేనేత జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ



కో ఆప్టెక్స్‌లో వస్త్రాలను పరిశీలిస్తున్న తమిళనాడు మంత్రి గాంధీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు కో–ఆప్టెక్స్ చేనేత వస్త్రాలు చిహ్నాలని, ఆప్కో, కో–ఆప్టెక్స్ షోరూమ్‌లలో ఇరు రాష్ట్రాల చేనేత వస్త్రాలను విక్రయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఆర్.గాంధీ అన్నారు. శుక్రవారం విజయవాడ ఏలూరు రోడ్డులో ఆధునికీకరించిన కో –ఆప్టెక్స్ షోరూంను తమిళనాడు చేనేత జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. తమిళనాడు ఆధ్వర్యంలోని కో–ఆప్టెక్స్ షోరూమ్‌లో ఆప్కో వస్త్రాలు, ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఆప్కో షోరూమ్‌లో కో–ఆప్టెక్స్ వస్త్రాలు విక్రయించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఎంతోమంది చేనేత కళాకారులు యంత్రాలు వినియోగించకుండా ఆకట్టుకునేలా చేనేత వస్త్రాలు రూపొందిస్తున్నారన్నారు. సాధారణ వస్త్రాలతో పోలిస్తే చేనేత వస్త్రాలు ముఖ్యంగా మహిళలు ధరించే చీరలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. మహిళల అధునాతన జీవనశైలి, అభిరుచులకు అనుగుణంగా కో–ఆప్టెక్స్ సైతం వస్త్రాల డిజైన్లలో మార్పులు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, తమిళనాడు కో–ఆప్టెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ జాకబ్, చీఫ్ జనరల్ మేనేజర్ ఎ.పి.రవి, జనరల్ మేనేజర్ శంకర్, రీజినల్ మేనేజర్ సి.నాగరాజన్ పాల్గొన్నారు.

బాపులపాడులో అమెరికా బృందం



కాకులపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న అమెరికా బృంద సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంతో ఆహార భద్రతతో పాటు ఆరోగ్య భద్రతను ప్రజలకు చేరువ చేస్తుండటం ప్రశంసనీయమని అమెరికాకు చెందిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో క్రైగ్ కోగట్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమాన్ని పరిశీలించేందుకు అమెరికా వాతావరణ మార్పు, సుస్థిర వ్యవసాయ రంగ నిపుణుల బృందం బాపులపాడు మండలంలోని కానుమోలు, కాకులపాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించింది. తొలుత కానుమోలులో గృహిణి అనురాధ నిర్వహిస్తున్న 365 రోజుల కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముచ్చటించారు. ఇంట్లోకి రోజువారీ కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలను కిచెన్ గార్డెన్ ద్వారా పెరట్లోనే పండించుకునే విధానాన్ని అనురాధ ద్వారా ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ఫుడ్ బాస్కెట్ ప్రాజెక్టు గురించి ఆరా తీశారు. అనంతరం కాకులపాడుకు చెందిన రైతు చింతయ్యకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని అమెరికా బృంద సభ్యులు సందర్శించారు. పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో క్రైగ్ కోగట్ రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం నుంచి రైతులకు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు ఏపీసీఎన్ఎఫ్ కృషి సాహసోపేతమన్నారు.

STOCK MARKET లో
డబ్బులు సంపాదించడం ఎలా?
సులభంగా .... సంతోషంగా
FREE SEMINAR
23rd FEBRUARY SUNDAY
Sunday 11 A.M, 3 P.M, 7 P.M
N CONVENTION
Lakshmi Talkies Centre
MACHILIPATNAM
Krishna Kailas
703 280 4888
703 280 5888
701 369 0018

క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో క్యాట్ సభ్యులు



మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(సీఏటీ) సభ్యులు లతా బీ పాట్నే, షాలిని మిశ్రా, జి.నవీన్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, వెంకటేశ్వరరావు, మణిదీప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కూచిపూడిలో మాతృభాషా దినోత్సవం



కూచిపూడి(మొవ్వ): తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అమ్మలాంటి కమ్మని మాతృభాషలో మాట్లాడి తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేయాలని కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ ఆకాక్షించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి కళా పీఠంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళా పీఠం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఎంపిక చేసినట్లు కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.వంశీకృష్ణ ప్రసాద్ తెలిపారు. వన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీలో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామన్నారు. మహిళల జట్టుకు సత్య, షర్మిల, లక్ష్మి, శ్రావణి, లేపాక్షి, జాహ్నవి, అరుణనాగదుర్గ, ద్వారకేసరి, తనూజ, మానస, లోకేశ్వరి, భారతి, ధనుంజయశ్రీ, లీనాశ్రీ, భాగ్యలక్ష్మి, సుష్మాస్వరాజ్, పురుషుల జట్టుకు రితేష్, అభిష్, గౌతమ్, సుభాష్, దాని, సాయిగణేష్, భీమా, ధనుంజయ్, చరణ్, ధనుష్, దీపక్, వెంకటరత్నం, సీతయ్య, సంతోష్, చరణ్ ఎంపికైనట్లు తెలిపారు. కర్నూలులో ఈ నెల 23వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని వెల్లడించారు.

వ్యాపారాలు లేవు!

- వాణిజ్య పన్నుల శాఖ సమీక్షలో జిల్లా అధికారుల వెల్లడి
- గత ఏడాది ఆదాయం సైతం రాని వైనం
- గత ఏడాదిపై 30 శాతం అధికంగా టార్గెట్ చేయాలంటూ హుకుం
- తలలు పట్టుకుంటున్న వాణిజ్య పన్నుల శాఖ జిల్లా అధికారులు



వినియోగదారులు లేక బోసిపోయిన పాతబస్తీలోని కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్ (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'కరవమంటే కప్పకు కోపం... అరవమంటే పాముకు కోపం' సామెత చందాన తయారైంది ఉమ్మడి కృష్ణాజిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పరిస్థితి. కూటమి సర్కార్ విధానాలతో ఉమ్మడి జిల్లాలో వ్యాపారాలు లేక ఆ శాఖకు రావాల్సిన ఆదాయానికి గండి పడింది. అయితే ''ఆదాయం తగ్గితే ఎలా...? ప్రభుత్వానికి డబ్బులు తెచ్చే శాఖలో రెవెన్యూ పడిపోతే బాగుండదు. మీరు ఏం చేస్తారో తెలియదు ఆదాయం పెరగాల్సిందే...'' అంటూ రాష్ట్ర అధికారులు జిల్లా అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెడుతున్నారు. గడిచిన తొమ్మిది మాసాలుగా వ్యాపారాలు లేక జీఎస్టీ తగ్గుతూ వస్తున్న విషయం తెలిసిందే.

వ్యాపారాలు పూర్తిగా దిగజారిన వైనం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వ్యాపారాలు పూర్తిగా దిగజారాయి. ప్రధానంగా కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు నాయకత్వంలో అమలు చేస్తున్న విధానాలతో అన్ని వ్యాపారాలపై ప్రభావం చూపుతోందని వ్యాపార, వాణిజ్య రంగ ప్రముఖులు చెబుతున్నారు. వ్యాపారాలు లేకపోవటంతో పలువురు వ్యాపారులు దివాలా తీసే పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా విజయవాడ నగరంలో అత్యధికంగా జరిగే వస్త్రాలు, బంగారం, కిరాణా తదితర రంగాలకు సంబంధించిన వ్యాపారాలు లేకపోవటంతో ఆ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గడిచిన పండుగ సీజన్‌లో తమ వ్యాపారాలకు భారీగా గండి పడిందని వ్యాపార సంఘాల నేతలు చెబుతున్నారు. దానికి తోడు ప్రస్తుతం కొనసాగుతున్న పెళ్లిళ్ల సీజన్‌లోనూ వ్యాపారం లేకుండా పోయిందంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన నిర్మాణరంగం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా ఆదాయం వచ్చే రంగం సిమెంట్ పరిశ్రమ. దానికి తోడు ఇతర నిర్మాణ అనుబంధ రంగాల నుంచి ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అంచనా. అయితే సిమెంట్ అమ్మకాలు గత ఏడాది మీద 30 నుంచి 35 శాతం పడిపోయాయంటూ వ్యాపారులు చెబుతున్నారు. ఆ మేర వాణిజ్య పన్నుల శాఖ అధికారుల లెక్కలు సైతం ధ్రువీకరిస్తున్నాయి. దాంతో నిర్మాణ రంగానికి అనుబంధంగా ఉండే ఇతర రంగాల అమ్మకాలు కూడా దిగజారాయి. ఈ రంగాలపై ఆధారపడిన కార్మికులు, ప్రజానీకం సైతం సరైన ఆదాయం లేక అల్లాడుతున్నారు.

ఆటోమొబైల్ రంగానికీ అదే పరిస్థితి

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సిమెంట్ పరిశ్రమతో పాటుగా భారీగా ఆదాయం వచ్చే మరో రంగం ఆటోమొబైల్ పరిశ్రమ. ఈ రంగం నుంచి సైతం ప్రభుత్వానికి రావాల్సిన జీఎస్టీ వసూళ్లు పూర్తిగా దిగజారిపోయాయి. విజయవాడ-3 డివిజన్ పరిధిలో దాదాపుగా ఆటోమొబైల్ నుంచి అత్యధికంగా ఆదాయం ఉంటుంది. ఈ రంగం పూర్తిగా పడకవేయటంతో ఆదాయం టార్గెట్ దేవుడెరుగు కనీసం గత ఏడాది వచ్చిన రెవెన్యూ సైతం వచ్చే పరిస్థితులు లేవని సర్కిల్ స్థాయి అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు రూ.6500 కోట్లు టార్గెట్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడ-1 డివిజన్, విజయవాడ-2 డివిజన్, విజయవాడ-3 డివిజన్‌గా వాణిజ్య పన్నుల శాఖ పని చేస్తుంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ -1,విజయవాడ-2 డివిజన్లుగా ఉండగా కృష్ణాజిల్లాలో అధిక భాగంగా విజయవాడ-3 డివిజన్ పరిధిలో కొనసాగుతోంది. మూడు డివిజన్ల పరిధిలో 17 సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా సరాసరిన సుమారు నాలుగు నుంచి రూ.4500 కోట్ల మేర వాణిజ్య పన్నుల శాఖకు ఆదాయం వస్తుంది. ఈ ఏడాది ఆ శాఖ ఆరున్నర వేల కోట్ల మేర ఉమ్మడి జిల్లా నుంచి ఆదాయం రావాలని టార్గెట్ పెట్టారని, లేకుంటే కనీసం ఆరు వేల కోట్లకు రీచ్ కావాలంటూ ఒత్తిడి పెడుతున్నట్లుగా సమాచారం. కానీ జనవరి మాసాంతానికి కనీసం నాలుగు వేల కోట్ల ఆదాయం కూడా దాటకపోవటంతో ఆ శాఖ అధికారులపై మరింత ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది. అది కూడా పాత బకాయిలపై దృష్టి పెట్టడంతో ఆ మాత్రం ఆదాయమైనా వచ్చిందని ఒకరిద్దరు అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గత ఏడాది ఆదాయం సైతం వచ్చే పరిస్థితులు లేవని ఆ శాఖ ఉద్యోగ సంఘ నేతలే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

నేత కార్మికుల సంక్షేమం కోసమే ఏఐడబ్ల్యూఎఫ్

- ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్
- పెడనలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహణ



మాట్లాడుతున్న ఏఐడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఆనందప్రసాద్

పెడన: చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నిరంతరం పనిచేస్తుందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనందప్రసాద్ అన్నారు. పట్టణంలోని శ్రీవిఘ్నేశ్వర ప్రార్థన మందిరంలో శుక్రవారం గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ నేత్రాలయ వారి సహకారంతో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తొలుత శిబిరాన్ని నేత్రాలయం వైద్యురాలు షెఫాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆనందప్రసాద్ మాట్లాడుతూ నేత కార్మికులు నేత నేసే సమయంలో సన్నని దారపు పోగులు సక్రమంగా చూసుకోవాల్సి ఉంటుందని, కంటి చూపు తీక్షణంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేత కార్మికులకు చూపు బాగుంటేనే నేత బాగా నేయగలరని, ఈ ఉద్దేశంతోనే తాము ఫెడరేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా పెడనలో కంటి వైద్య శిబిరం పెట్టామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. నేత కార్మికులే కాకుండా ఇతర వృత్తుల వారు కూడా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. నేత్రాలయం వారు ఉచితంగా ఆరోగ్యశ్రీపై వైద్య పరీక్షలు చేయడమే కాకుండా శస్త్రచికిత్సలు కూడా చేస్తారన్నారు. ఇప్పటి వరకు నేత్రాలయం వారు 2,500కు పైగా శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా 4 లక్షల మందికి శస్త్రచికిత్సలను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరాంప్రసాద్, జాతీయ కార్యవర్గ సభ్యుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు పిచ్చుక ఫణికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకురాతి జనార్దనరావు, కోశాధికారి తాళ్ల బాలాజీ, నేత్రాలయం క్యాంపు ఇన్‌చార్జి రవి, ఫెడరేషన్ నాయకులు కట్టా హేమసుందరరావు, దేవాంగ సంక్షేమ సంఘ యువజన విభాగం ఉపాధ్యక్షుడు ఊటుకూరి సుధీర్‌కుమార్, భళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 123 మంది ఓపీలో నమోదు అవగా 49 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి మొదటి విడతలో 17 మందిని పెదకాకాని తరలించినట్లు ఫెడరేషన్ వారు తెలిపారు.

లేగదూడల అందాల పోటీలు



పెనుగంచిప్రోలు: స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంస్థ, గన్నవరం వారి ఆధ్వర్యంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ కె.శ్రీనివాసులు లింగ నిర్ధారణ ద్వారా, కృత్రిమ గర్భధారణ ద్వారా ఉపయోగాలు, నట్టల నివారణ మందులు వాడటం, ముర్రుపాలు తాగించటం వలన కలిగే ఉపయోగాలు, లేగదూడల సంరక్షణ గురించి రైతులకు వివరించారు. అనంతరం మంచి పోషణ కలిగిన దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, కాల్షియం, లివర్ టానిక్, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నందిగామ డివిజన్ డీడీ డాక్టర్ మోజెస్ వెస్లీ, ఏడీ డాక్టర్ వెంగళరావు, పశువైద్యులు పి.అనిల్, అర్చన, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పామర్రులో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పామర్రు: నేరాలను అదుపు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి విజయాలు సాధిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. పామర్రు సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను రిజిష్టర్లను తనిఖీలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈగిల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి దీని ద్వారా గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి పాఠశాలలో ఈగిల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

పాత నేరస్తులపై నిరంతర నిఘా

పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంటుందని ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. వీరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పుడు పోలీస్ శాఖకు అవసరమైతే అప్పుడు వివరాలను త్వరితగతిన అందించేందుకు సిద్ధంగా ఉంటున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, పామర్రు సీఐ సుభాకర్, పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం ట్రాఫిక్ పీఎస్ తనిఖీ చేసిన ఐ.జి

గన్నవరం: స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలిసి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఐజీ స్టేషన్ సిబ్బంది, ట్రాఫిక్ రద్దీ వివరాలను సీఐ పెద్దిరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడంతో వీవీఐపీలు, వీఐపీలు రాకపోకల వల్ల ట్రాఫిక్ రద్దీ ఎక్కువగానే ఉందన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి సభలు, సమావేశాలు కూడా ఈ ప్రాంతంలోనే నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం పూర్తయితే ఈ ట్రాఫిక్ సమస్యల నుంచి కొంత ఉపశమనం లభిస్తుందన్నారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరును మరింత మెరుగుపర్చేందుకు త్వరలో కృష్ణాజిల్లాలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోలీస్ స్థలాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఒక నివేదిక తయారు చేస్తున్నట్లుగా తెలిపారు. త్వరలో చేపట్టనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కానున్నట్లు చెప్పారు. గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ సీఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో వీరమ్మతల్లి తిరునాళ్ల ముగింపు



భక్తులను అలరించిన అమ్మవారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన

ఉయ్యూరు: వీరమ్మతల్లీ...కాపాడమ్మా...కల్పవల్లీ.. కరుణించమ్మా..అంటూ భక్తజనం అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారంతో 14వ రోజుకు చేరింది. 15 రోజులు పాటు జరిగే తిరునాళ్లు శనివారంతో ముగియనుండటంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అశేష భక్తజనం తరలివచ్చి చల్లనితల్లిని దర్శించుకుని భక్తి పారవశ్యం చెందారు. మహిళలు పాలపొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పొట్టేళ్ల ప్రభ బండ్లుతో ఊరేగి అమ్మకు మొక్కులు చెల్లించారు. సంతానం ప్రసాదించాలని వేడుకుంటూ ఆలయం వెనుక పసుపు దుస్తులతో పానాచారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అమ్మవారి ప్రసాదంగా అన్నసంతర్పణ చేశారు. ఉయ్యూరు పట్టణ పోలీసులు గురువారం ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కుబడి చెల్లించారు. సీఐ రామారావు, ఎస్ఐ విశ్వనాథ్‌తో కలిసి పొట్టేళ్లను కానుకగా ఇచ్చి పట్టువస్త్రాలు సమర్పించారు.

అలరించిన అమ్మవారి జీవిత చరిత్ర నాటకం

శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన ఆద్యంతం భక్తులను అలరించింది. తిరునాళ్లను పురస్కరించుకుని ఎంకే ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు ఆధ్వర్యంలో ఎంకే గ్రూప్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణలో సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. అమ్మవారి జీవితచరిత్రను నాటక రూపంలో ప్రదర్శించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు.

చిన్నారి ప్రాణాలు తీసిన పంఖా

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యశ్వంత్



బాలుడి మృతికి కారణమైన టేబుల్ ఫ్యాను

జి.కొండూరు: అసలే పేద కుటుంబం. పొట్ట చేత బట్టుకొని ఆ భార్య, భర్తలిద్దరూ పిల్లలతో కలిసి ఇటుక బట్టీలో పనికి వచ్చారు. పిల్లల భవిష్యత్తును కలలు కంటూ, బట్టీలో పని చేస్తూ కాలం వెళ్లదీస్తున్న ఆ కుటుంబాన్ని మృత్యువు విషాదంలోకి నెట్టింది. ఇంట్లో వెలుగులు నింపాల్సిన విద్యుత్ ఆ ఇంట్లో చీకట్లు కమ్మేలా చేసింది. వివరాల్లోకి వెళ్తే...బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, పెద్దపాలెం గ్రామానికి చెందిన ఇందుమూడి రవి తన భార్య కల్పన, కుమార్తె మంజూష, కుమారుడు యశ్వంత్(6)తో కలిసి గత డిసెంబరులో ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామ శివారులోని ఇటుక బట్టీలో పని చేసేందుకు వచ్చారు. గురువారం అర్ధరాత్రి కుటుంబం అంతా గాఢ నిద్రలో ఉండగా యశ్వంత్ చేయి స్టాండ్ ఫ్యానుకు తగిలింది. అయితే ఆ ఫ్యానుకు విద్యుత్ సరఫరా అవడంతో యశ్వంత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే నిద్రలేచిన తండ్రి రవి, కొడుకును తప్పించబోయి తాను కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి రవి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు రవిని మైలవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రవికి ప్రాణాపాయం లేదని వైద్యులు తేల్చారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు కళ్లమందే చనిపోవడాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మైలవరం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కోలుకున్న చిన్నారులు

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసిన కోడిగుడ్లు తిన్న చిన్నారులు 9మంది అస్వస్థతకు గురికాగా మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు రోజులుగా చికిత్స పొందుతున్నారు. వీరిలో ఆరుగురు చిన్నారులు పూర్తిగా కోలుకోవడంతో వారిని డిస్‌చార్జి చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాశ్ శుక్రవారం తెలిపారు. మిగతా ముగ్గురి ఆరోగ్యం సంతృప్తిగానే ఉందని,అయితే కొంచెం నీరసంగా ఉండటంతో వారిని ఆసుపత్రిలోనే ఉంచి వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, డీసీహెచ్ నాయక్, ఆరోగ్య శాఖ సిబ్బంది, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చిన్నారుల ఆరోగ్యం గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు.

బాలల అస్వస్థతపై అధికారుల విచారణ

తిరువూరు: ఎ.కొండూరు మండలం పెదతండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ శ్రీలక్ష్మి గురువారం రాత్రి మైలవరం ప్రభుత్వాసుపత్రిలో పిల్లల తల్లిదండ్రులను, పెద తండా అంగన్‌వాడీ కేంద్ర సిబ్బందిని విచారించారు. తిరువూరు ఐసీడీఎస్ సీడీపీవో సత్యవతి పెదతండా వాసులను, పిల్లల తల్లిదండ్రులను కలిసి చిన్నారులు అస్వస్థతకు గురైన విషయంలో వారి అభిప్రాయాలు సేకరించారు.

"తెలుగు తేజం" పాఠశాల పత్రిక ఆవిష్కరణ



చెన్నూరులో తెలుగు తేజం పత్రికను ఆవిష్కరించిన సౌజన్య తదితరులు

పెడన: మండలంలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్ఎం సిద్ధినేని సౌజన్య రూపొందించిన 'తెలుగు తేజం' పాఠశాల పత్రిక ఏడవ సంచిక, ఈ-బుక్‌ను పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులలో భాష పట్ల ఆసక్తి పెంచడానికి వారిలో పఠనాశక్తిని, రచనా శక్తిని పెంచటానికి ఇలాంటి పత్రికలు దోహదపడతాయన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కథలు, కవితలు, పద్యాలు వంటివి రాయడం, బొమ్మలు గీయటం, వారు చదివిన పుస్తకాల నుంచి మంచి అంశాలు సేకరించి పాఠశాల పత్రికకు ఇవ్వడం మంచి పరిణామమన్నారు. పత్రికకు సంపాదకులుగా కలిదిండి రాంబాబు, ఉప సంపాదకులుగా పరిశే రాజేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయిని ఎం. పద్మజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే రికార్డులను పరిశీలించిన అడిషనల్ డైరెక్టర్



పెడనలో రీ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

పెడన: మండలంలోని భా.హుస్సేన్‌పాలెంలో భూముల రీ సర్వే కార్యక్రమం పూర్తి కావడంతో ఆ రికార్డులను ల్యాండ్ అండ్ సర్వే శాఖ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు పరిశీలించారు. ఆయన శుక్రవారం పెడన తహసీల్దారు కార్యాలయానికి విచ్చేయడంతో ల్యాండ్ అండ్ సర్వే జిల్లా అధికారి జోషిలా, మచిలీపట్నం ఆర్డీవో ఎం.స్వాతి, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన పుల్లపాడు పంచాయతీ పరిధిలోని భా.హుస్సేన్ పాలెం గ్రామానికి సంబంధించి వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములన్నీ కలిపి 229 ఎకరాలున్నాయని, వాటికి సంబంధించిన సర్వే నంబర్లు, రీ సర్వే నివేదికల రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్, మండల సర్వేయర్ దాసు, సర్వే డీటీ సల్మా పూర్తి వివరాలను తెలియజేశారు. అనంతరం ఆయన మచిలీపట్నం మండలంలో ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారు.

రీసర్వే పనులను పరిశీలించిన ఉన్నతాధికారులు

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా శుక్రవారం మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం గ్రామ సరిహద్దులు, భౌగోళిక సత్య నిర్ధారణ నిర్వహించారు. ఈ ప్రక్రియను ఏపీ స్టేట్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అకాడమీ జాయింట్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్, గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రమణ్యం, తహసీల్దారు కె.వెంకటశివయ్య స్వయంగా తనిఖీ చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ ఇప్పటి వరకు 420 ఎకరాల్లో రీసర్వే ప్రక్రియ సంతృప్తికరంగా పూర్తయిందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీభూమి వెబ్‌సైట్ ద్వారా చూడవచ్చని తెలిపారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE

PLOT FOR SALE

■ విజయవాడ, కంకిపాడు, హరివిల్లు ఐకాన్ వెంచర్స్ నందు 146 చ.గ.ల వెస్ట్ ఫేస్ రీ సేల్ ప్లాట్ అమ్మకానికి కలదు. సెల్: 94936 78904

■ బంపర్ ఆఫర్ కే రూ. 6 లక్షలకే 120 గ గేటెడ్ కమ్యూనిటీలో హౌసింగ్ ప్లాట్లు HMDA పరిధిలో కలవు రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్: 63097 71255/ 77997 17179

COMMERCIAL FOR SALE

■ Vijayawada, Bhavanipuram, 1519 sq.yds, Open land for sale. Commercial use, By-Pass Road, Beside Bhashyam School. Ph: 9949321555, 9848041664

WANTED

■ విజయవాడ సిటీలో ఆఫీస్‌లో పనిచేయుటకు అనుభవం గల టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, ఆయాలు కావలెను. ✆ 82978 71278, 81429 97766

■ Lady Teachers needed for a school in Poranki, Vijayawada. Salary : 24,000/- to 28,000/-, Qualifications : M.Sc., MA, B.Tech, B.Sc. Please do not call. Send your details via WhatsApp : 85230 58441

■ రియల్ ఎస్టేట్స్ నందు పనిచేయుటకు టెలికాలర్స్ M/F కావలెను. జీతం + కమీషన్ పద్ధతిపై. సంప్రదించండి : ✆ 97034 34023

■ Wanted Sales Executives, Auto Drivers for 3 EV Auto Showroom at B6 Ind Estate, VJA. ✆ 93921 02274

■ Wanted Female Exp. Tele Callers, Qly: Inter / Deg / PG Salary: Up to 18 K + Incts + Bonus. Vijayawada. ✆ 99080 98305, 70933 19488

■ విజయవాడలోని ప్రముఖ రియల్ సంస్థ వారికి మార్కెటింగ్ సిబ్బంది కావలెను. డిజిటల్ మార్కెటింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. మంచి కమీషన్ ఇవ్వబడును. ✆ 91107 53627

■ Wanted Male Marketing Staff, Course incharges and Female Telecallers Qualification Any Degree Age Limit: 25 to 45 years, Salary: 10,000/- to 25,000/- working Location: Master Minds College, Vijayawada, Contact: 89781 80832

■ విజన్ ఆటోమొబైల్స్ అపె ఆటో షోరూము కృష్ణా జిల్లాలోని విజయవాడ, గుడివాడ నందు సేల్స్ మేనేజరు - 4, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ - 18, స్పేరు పార్ట్స్ మేనేజరు - 2, సర్వీసు సూపర్‌వైజర్లు - 4, మెకానిక్స్ - 6, రిసెప్షనిస్టు - 4, అకౌంటెంట్-2, హెల్పర్-6, కంప్యూటర్ ఆపరేటర్స్- 5, కావలెను. సంప్రః సెల్ :77999 09045 / 77999 09054. Email: visionauto.jobs@gmail.com. గమనిక : ది. 23/02/2025, ఉ:: 10.00 గం||లకు ఇంటర్వ్యూలు జరుగును. వేదిక : విజన్ ఆటో మోటివ్, ప్లాట్ నెం. 42 & 43, 100 అడుగుల రోడ్, PSC బోస్ రోడ్, ఆటోనగర్, VRL ఆఫీస్ ఎదురు, విజయవాడ.

■ శ్రీశ్రీశ్రీ హోటల్, ఖమ్మం నందు పని చేయుటకు సౌత్ ఇండియన్ మాస్టర్ (మీల్స్ + టిఫిన్స్) వెంటనే కావలెను. సంప్రదించండి. Ph:91216 20696

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899

■ కష్టపడక్కర్లేదు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం + భోజనం. HYD. 7995365999

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తమకు ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి దినపత్రికలో ప్రకటనలకై మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మచిలీపట్నం, పెడన 9912220643 | అవనిగడ్డ 7995566983 | గుడివాడ 7995092118 | పామర్రు 9010577766 | కైకలూరు 9951602985 | నందిగామ 7995092114 | జగ్గయ్యపేట 9912220547 | మైలవరం, ఇబ్రహీంపట్నం 9010223734 | తిరువూరు 9951020399 | నూజివీడు 9912220544

ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా వాలుకు లైన్లు రూ.600/ ప్రతి అదనపు లైను రూ.150/ + 5% GST

కెనరా బ్యాంక్ Canara Bank

విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా. ☎ 0866-2567779, 9440905155

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేదీ & సమయం: 26.03.2025, ఉ. 12.30 గం.ల నుండి మ. 2.00 గం.ల వరకు

రిజర్వు ధర: రూ. 21,39,000/-

ధరావత్తు సొమ్ము: రూ. 2,13,900/-

తేది: 21.02.2025, ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్